ఎవరిని గెలిపిస్తారో..?

మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలో ఓటేసిన 19 లక్షల మంది

- గెలుపోటములను ప్రభావితం చేయనున్న మైనారిటీల ఓట్లు
- మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలో సర్వత్రా ఇదే చర్చ
- బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ అంటున్న రాజకీయ విశ్లేషకులు

నిజాంపేట్: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజక వర్గంలో పోటీ పడుతున్న ప్రధాన పార్టీల ముగ్గురు అభ్యర్థుల గెలుపోటములను ముస్లిం ఓటర్లు ప్రభావితం చేయనున్నారనే చర్చ జోరుగా జరుగుతోంది. కాంగ్రెస్ నుంచి సునీతామహేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి ఈటల రాజేందర్, బీఆర్‌ఎస్ నుంచి రాగిడి లక్ష్మా రెడ్డిలు ప్రధానంగా పోటీ పడి ప్రచారం నిర్వహించి ప్రజల మద్దతు పొందేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. ఇక్కడ పోటీ ఇద్దరి మధ్యనా లేక ముగ్గురి మధ్యనా అనే దానిపై రాజకీయ విశ్లేషకులు రకరకాల విశ్లేషణలు చేస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రధాన పోటీ ఉందని కొందరు లేదు ముగ్గురు మధ్య పోటీ ఉంటుందని ఇంకొందరు అంటున్నారు. ఎక్కడ చూసినా ఇదే చర్చ జరగడం మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో హాట్ టాపిక్‌గా మారింది.

◆ దేశంలోనే అత్యంత ఎక్కువగా ఓటర్లు ఉన్న లోక్‌సభ స్థానం మల్కాజిగిరి కావడంతో ఇక్కడి ఎన్నికపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. ఈ నియోజకవర్గంలో సుమారు 38 లక్షల ఓటర్లు ఉన్నారు. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో 50 శాతానికి పైగా సుమారు 19 లక్షల మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మరి ఈ పోలైన ఓట్లలో ఎవరు ఎక్కువగా ఓట్లు సాధిస్తారో అనే లెక్కలు మాత్రం అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

బీఆర్‌ఎస్‌కు నాటి ఆదరణ లభించేనా..?

◆ బీఆర్‌ఎస్ పార్టీకి అంసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కాంగ్రెస్, బీజేపీలను కాదని బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను గెలిపించారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలోని అన్ని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలే గెలుపొందారు. మరి ప్రస్తుతం మారి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థికి పట్టం కడతారా? లేదా? అనేది తేలాల్సి ఉంది.

పోల్ మేనేజ్‌మెంట్‌లో పోటీ పడ్డా కాంగ్రెస్, బీజేపీలు..


◆ ఎన్నికల ప్రచారం ఒక ఎత్తు కాగా పోల్ మేనేజ్‌మెంట్ మరో ఎత్తు ఈ ఎత్తులో పై చేయి సాధించేందుకు కాంగ్రెస్, బీజేపీలు తీవ్రంగా పోటీపడ్డాయి. లోక్ సభ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోని బస్తీలపై కాంగ్రెస్ పూర్తిస్థాయి దృష్టి సారించి పోల్ మేనేజ్‌మెంట్ చేయడంలో బీజేపీ కంటే ఒక అడుగు ముందు ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీ సైతం కాంగ్రెస్‌తో పోటీపడి తన వంతు ప్రయత్నం తీవ్రంగానే చేసింది. బీఆర్‌ఎస్ మాత్రం కాంగ్రెస్, బీజేపీల తరువాత నిలిచిందని చెప్పవచ్చు.

బీజేపీ అభ్యర్థి ఈటల వైపు మొగ్గు..!

◆ మల్కాజిగిరి నుంచి బీజేపీ నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న ఈటల రాజేందర్ వైపు ప్రజల మొగ్గు చూపారా అనేది మాత్రం అంతు చిక్కడం లేదు. కొంత సానుకూలత అయితే ప్రజల నుంచి లభించినట్లు కనిపించింది. మరి ఆ సానుకూలత ఓట్ల రూపంలో మళ్లిందా లేదా? అనేది చూడాలి. అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీ, ఉత్తర భారతీయులు, క్లాస్ ఓటర్లపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. అదే విధంగా యువత సైతం బీజేపీకే ఓటు వేశారని అంచనాలో ఆ పార్టీ నాయకులు ఉన్నారు.

సీమాంధ్రులు ఓటేయకపోవడం ఎవరికి నష్టం.. ఎవరికి లాభం..?

◆ ఈ నెల 13న తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఎన్నికలు ఉండటంతో మల్కాజిగిరి లోక్ సభ స్థానంలో నివాసం ఉండే సీమాంధ్ర ప్రజలు ఆంధ్రప్రదేశ్‌లో ఓటు వేసేందుకు వెళ్లారు. ఇక్కడ ఓటు వేయలేదు. ఇలా ఇక్కడ ఓటు వేయకపోవడం వల్ల ఎవరికి నష్టం.. ఎవరికి లాభం అనే అంశంపై అభ్యర్థులతో పాటు నాయకులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వెళ్లిన వారంతా బీజేపీకి ఓటు వేసే వారని కాంగ్రెస్ వారు భావిస్తున్నారు. బీఆర్‌ఎస్‌కు వేసేవారని బీజేపీ వారు భావిస్తున్నారు.



మైనారిటీల ఓట్లు ఏ పార్టీకి..?

◆ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కేవలం ముస్లిం ఓట్లు సుమారు 5 నుంచి 6 లక్షల వరకు ఉంటాయనేది అంచనా. ముస్లిం ఓటర్లు బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల్లో ఏవరి వైపు మొగ్గు చూపరనేది ప్రస్తుతానికి చర్చ జరుగుతుంది. అయితే ఎంఐఎం అధినేత సైతం లోక్‌సభ ఎన్నికల్లో ముస్లింలు అందరు హైదరాబాద్ లోక్‌సభ స్థానం మినహ అంతటా కాంగ్రెస్‌కు ఓటు వేయాలని చెప్పిన విషయంపై తీవ్రంగా చర్చ జరుగుతోంది.

◆ ముస్లిం వంద శాతం బీజేపీకి వ్యతిరేకంగానే ఓటు వేశారని అందులో మెజార్టీ కాంగ్రెస్ పార్టీకే ఓట్లు వేసి ఉండొచ్చని... .ఇక క్రిష్టియన్ ఓటర్లు సైతం బీజేపీకి వ్యతిరేకంగానే ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. క్రిష్టియన్ ఓటర్లు సైతం మల్కాజిగిరి ఎంపీ స్థానం పరిధిలో 3 నుంచి 4 లక్షల మధ్యలో ఉంటారని క్రిష్టియన్ సంఘాలు పేర్కొంటున్నాయి.

◆ ముస్లిం, క్రిష్టియన్ ఓటర్లలో ఎంత మంది తమ ఓటు హక్కును వినయోగించుకున్నరనేది సైతం ప్రధాన అంశం. అదే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారని. రిజర్వేషన్లు తొలగిస్తారని విస్తృతంగా ప్రచారం చేశారు. అయితే ఏ వర్గం ఓటర్లు ఏ పార్టీని ఆదరించారనేది ఎన్నికల ఫలితాల రోజు తేలాల్సి ఉంది.



'మనూ'లో అడ్మిషన్ల ప్రక్రియ షురూ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఉర్దూ విభాగంలో పలు కోర్సులకు అడ్మిషన్ల పక్రియ ప్రారంభించినట్లు ఉర్దూ విభాగాధిపతి ప్రొఫెసర్ షంషల్ హోదా ఆదివారం తెలిపారు. కొత్త విద్యాసంవత్సరానికి ఉర్దూ(ఎంఏ)లో 2024–25 అడ్మిషన్లు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఉర్దూ భాష లేదా మాధ్యమంతో యూజీలో ఏదైనా గ్రాడ్యుయేట్‌లకు ఈ కోర్సుకు అర్హులుగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. మనూ హైదరాబాద్ క్యాంపస్‌లో 50 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారం, ఇతర వివరాలు అందుబాటులో ఉన్నాయని, ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9494440782లో సంప్రదించాలని ఆయన కోరారు.

బాధితులకు జంతుప్రేమికుల పరామర్శ

రహమత్‌నగర్: బంగారు మైసమ్మ ఆలయం వద్ద జరిగిన దాడిలో గాయపడి వ్యక్తులను జంతు ప్రేమికులు, బస్తీవాసులు ఆదివారం పరామర్శించారు. బంగారు మైసమ్మ ఆలయం వద్ద పెంపుడు కుక్క ఇంట్లో దూరిందని ఈ నెల 14న రాత్రి ధనుంజయ్ తన అనుచరులతో కలిసి శ్రీనాథ్, స్వప్నలతో వారి పెంపడు కుక్కపై విచక్షణారహితంగా దాడి చేసిన సంగతి విదితమే. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో జంతుప్రేమికులు ఈ ప్రాంతంలో ఆ దోళన సైతం నిర్వహించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ శ్రీనాథ్, స్వప్నలు చికిత్స అనంతరం ఆదివారం తమ నివాసానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న జంతు ప్రేమికులు, బస్తీవాసులు వీరిని పరామర్శించేందుకు పెద్ద సంఖ్యలో వీరి నివాసానికి వచ్చారు. అండగా మేముంటాం అంటూ అభయమిచ్చారు. దాడిలో గాయపడ్డ పెంపుడు కుక్క పరిస్థితి విషమంగా ఉందని బాధితులు రోదిస్తూ చెప్పారు.

శంకరాచార్యులు గొప్ప తత్వవేత్త

చిక్కడపల్లి: ప్రతి జీవిలోనూ దైవత్వాన్ని దర్శించిన ఆది శంకరాచార్యులు గొప్ప తత్వవేత్త అని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. శతాబ్ది పూర్వ మహనీయుల యాది కార్యక్రమంలో ఆదివారం శ్రీ త్యాగరాయ గానసభలోని కళావెంకట దీక్షితులు కళావేదికపై శంకరాచార్య సంస్మరణ కార్యక్రమం గాన సభ అధ్యక్షుడు కళా వీఎస్ జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ కాశీ విశ్వేశ్వర్ రావు మాట్లాడుతూ ఎనిమిదేళ్ల వయసులోనే సన్యాసం స్వీకరించి వేదాలకు భాష్యాలు చెప్పారని పేర్కొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఆరే మహేందర్

కుత్బుల్లాపూర్: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని బీసీ ఐక్యవేదిక తెలంగాణ అధ్యక్షుడు ఆరే మహేందర్ కోరారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ గత సార్వత్రిక ఎన్నికల్లో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో బీసీలకు 23 శాతం ఉన్నాయని, రిజర్వేషన్లను 42శాతం పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బీసీలకు ప్రభుత్వం నియమించబోయే నామినేటెడ్ పదవులు 50శాతం ఇవ్వాలని కోరారు. అదే విధంగా ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా కొన్ని యూనివర్సిటీల్లో వైస్‌చాన్సలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అందులో బీసీలకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఐక్యవేదిక కోఆర్డినేటర్ దశరథం, గ్రేటర్ హైదరాబాద్ బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు రాజేష్, ప్రధాన కార్యదర్శి రంగు క్రాంతి, నాయకులు జంగిల్, అఖిల్, మహేష్, దాది అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బాల మురుగన్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



స్వామివారికి ప్రసాదం తీసుకువెళ్తున్న భక్తులు

జీడిమెట్ల: బాల మురుగన్ కుమారస్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని తమిళ అసోషియేషన్ అధ్యక్షుడు పి.కొట్టాయి స్వామి అన్నారు. జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ వద్ద నూతనంగా నిర్మించిన బాల మురుగన్ కుమారస్వామి దేవాలయంలో ఆదివారం అంగరంగ వైభవంగా విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత మూడు రోజులుగా దేవాలయంలో హోమాలు, ప్రత్యేకపూజలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మొదటిరోజు స్వామివారి ఊరేగింపు, రెండోరోజు ప్రత్యేక హోమాలు, మూడోరోజు విగ్రహప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్‌లో ఉన్న తమిళులతో పాటు అన్ని వర్గాల ప్రజలు, రాజకీయాలతో సంభందం లేకుండా వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ అర్.గణేషన్, జనరల్ సెక్రటరీ కె.చిన్న స్వామి, ట్రెజరర్ టి.భాస్కర్, జాయింట్ సెక్రటరీ టి.అనందం తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానం

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని ఆదివారం 11వ డివిజన్‌కు చెందిన నల్లపోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 23న ఆలయ పునః ప్రతిష్ఠాపన సందర్భంగా నిర్వహించనున్న ప్రథమ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా రావాలని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు.



శ్రీనివాస్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న శ్రీనల్లపోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు

ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం



సుభాష్‌నగర్: ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మేడ్చల్ జిల్లా ఐఎన్‌టీయూపీఎఫ్ అధ్యక్షుడు చింతల నాగరాజు యాదవ్ అన్నారు. కొంపల్లి మున్సిపల్ పరిధి దూలపల్లి గ్రామంలో ఆదివారం రెనోవా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు సతీష్‌రెడ్డి, శ్రీకాంత్‌ల నేతృత్వంలో 127 మందికి బీపీ, జీఆర్‌బీఎస్, పీఆర్‌సీ పీఓ–02 పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

మేడ్చల్: కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల కట్టడికి ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని బీసీ సేన విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు గోదా అరుణ్‌యాదవ్ డిమాండ్ చేశారు. అధిక ఫీజులు, డోనేషన్ల పేరుతో కార్పొరేట్ విద్యాసంస్థలు నిరుపేదలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మేడ్చల్, శామీర్ పేట్, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లాగా కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు వెలుస్తున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సాయుధ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

కుత్బుల్లాపూర్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని షాపూర్‌నగర్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ మండల సీపీఐ నాయకులు సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, జిల్లా కమిటీ సభ్యులు వరప్రసాద్ మాట్లాడుతూ... పుచ్చలపల్లి సుందరయ్య జీవించిన కాలమంతా సమాజానికి మార్గదర్శకంగా నిలిచారని తెలిపారు. దేశంలో దోపిడీ, అసమానతలు లేని సమసమజాన్ని నిర్మించాలని కలలు కన్నారని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యులు బి.సత్యం పసుల, అంజయ్య, దేవదానం, స్వాతి, వెంకన్న కరుణాకర్, కె.శీను, భాష, దుర్గానాయక్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్

సుభాష్‌నగర్: మల్లారెడ్డి ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ సుచిత్రలోని 'సర్వే నంబర్ 82/1/ఈఈ'లో శనివారం జరిగిన భూ వివాదంపై ఆదివారం కొంపల్లి లోని హోటల్‌లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్ మాట్లాడుతూ... 2015లో కే.సుధామ వద్ద 9 మంది 3,393 గజాల భూమి కొనుగోలు చేశామన్నారు. తొమ్మిది మందిలో అప్పటి టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో పాటు తాము కూడా ఉన్నామన్నారు. కొనుగోలు చేసి నిబంధన ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకున్నామని.. ఆ భూమిని 2021లో సేరి శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తికి 9 మంది విక్రయించామని పేర్కొన్నారు. అప్పటి నుంచి అతడు సదరు స్థలంలోకి వెళితే మల్లారెడ్డి అడ్డుకుంటున్నారని తెలిపారు.

◆ ఈ విషయమై కోర్టును ఆశ్రయించి ఆర్డర్ ప్రకారం యజమాని పొజిషన్‌లోకి వెళ్తే మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి మల్లారెడ్డి దౌర్జన్యానికి దిగడం ఎంతవరకు సమంజసం అన్నారు. అవసరమైతే సర్వే పెట్టించాలని సదరు స్థలం ఎవరిదని తెలితే వారు దానికి కట్టుబడి ఉండాలని సవాల్ విసిరారు. ప్లాటు యజమానిపై దౌర్జన్యానికి దిగడమే కాకుండా ప్రభుత్వ విప్ అయిన తనపై నిందలు మోపడం సరైన పద్ధతి కాదన్నారు.

◆ పాలమ్మి కష్టపడి పైకి వచ్చానని చెప్పుకుంటూ కోట్లు గడించిన మల్లారెడ్డి భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై హైకోర్టుకు కూడా వెళ్తామని లక్ష్మణ్ పేర్కొన్నారు. గతంలో ఈ వివాదం కేటీఆర్ దగ్గరికి వెళ్లగా ఇదే మల్లారెడ్డి తాము మాట్లాడుకుంటాంలే అని చెప్పాడన్నారు. ఏది ఏమైనా వారం రోజుల పాటు ఇక్కడే ఉంటానని సదరు స్థలాన్ని విడిచి పెట్టేది లేదని లక్ష్మణ్ కరాకండిగా చెప్పారు.

82, 83లో సర్వే నిర్వహించారు..

◆ సుచిత్రాలోని వివాదం రేపిన 82, 83 సర్వే నంబర్లు రెవెన్యూ అధికారులు ఆదివారం ఉదయం సర్వే నిర్వహించారు. ముందుగా పోలీసు బలగాలను దింపి సుచిత్ర చౌరస్తా నుంచి మిలటరీ ప్రాంతం గుండా పద్మానగర్ వెళ్లే రోడ్డును అర కిలోమీటరు రాకపోకలు లేకుండా మూసివేసి పోలీసు బలగాలను మొహరించారు. మీడియా వాళ్లను కూడా అనుమతించలేదు. అనంతరం అధికారులు సర్వే నిర్వహించారు.

అనుమానాస్పద స్థితిలో యువతి అదృశ్యం



కల్పనాదేవి (ఫైల్)

సుభాష్‌నగర్: అనుమానాస్పద స్థితిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కై సర్ నగర్‌కు చెందిన ఉత్తమ్‌ఠాకూర్, కల్పనాదేవి(19)లకు ఎనిమిది నెలల క్రితం వివాహమైంది. రోజువారీ కూలి పనులు చేసే ఉత్తమ్ ఠాకూర్ ఈనెల 18న పని నిమిత్తం బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి రాగా భార్య కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల, బంధువుల ఇళ్ల వాకబు చేసినా ఫలితం లేకపోయింది. ఆమె మొబైల్ ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ రావడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆదివారం సూరారం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడు మృతి

ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

జీడిమెట్ల: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్లమ్మబండ ప్రాంతానికి చెందిన పూజారి సిద్దయ్య కుమారుడు డేవిడ్(18) అతడి ఇద్దరు స్నేహితులు సన్నీ, ఉదయ్‌కిరణ్‌లతో కలిసి శనివారం ఉదయం మరో స్నేహితుడిని కలిసేందుకు ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయటకు వెళ్లారు. శనివారం రాత్రి 11గంటల సమయంలో బాలానగర్ నుంచి షాపూర్‌నగర్ వైపు వస్తున్నారు. డేవిడ్ బైక్ నడుపుతుండగా సన్నీ, ఉదయ్‌కిరణ్ వెనకాల కూర్చున్నారు. వీరు ప్రయాణిస్తున్న బైక్ హెచ్‌ఎంటీ యూనియన్ బ్యాంకు వద్దకు చేరుకోగానే అదుపుతప్పి ద్విచక్రవాహనం కిందపడి డివైడర్‌కు ఢీకొట్టింది. ఈ ఘటనలో డేవిడ్ అక్కడికి అక్కడే మృతిచెందగా సన్నీ, ఉదయ్‌కిరణ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. డేవిడ్ మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. గాయాలైన ఇద్దరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడు డేవిడ్ తల్లి పోలేరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గుండ్లపోచంపల్లి చెరువులో ఈనెల 18వ తేదీన గుర్తు తెలియని శవం నీటిలో తేలాడుతూ కనిపించిందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు శవాన్ని వెలికి తీయించారు. మృతుడి వయస్సు (25–30) మధ్య ఉంటుందన్నారు. ఒంటిపై నలుపు రంగు షర్టు, నలుపు రంగు ప్యాంటు ఉందన్నారు. అతడి వద్ద ఎలాంటి వివరాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పొంగిపొర్లడం పరిపాటి.. నిర్లక్ష్యం అధికారులది.!



చింతల్ మార్కెట్ రోడ్డులోని శ్రీరావులమ్మతల్లి వెజిటబుల్ దుకాణం పక్కనే మ్యాన్‌హోల్ పొంగి పొర్లుతున్న దృశ్యం (ఇన్‌సెట్లో)

రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్లపై మురుగు ప్రవాహానికి అడ్డుకట్ట పడటం లేదు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల పొంగిపొర్లడం పరిపాటి మారింది. ప్రతి నెలా డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నిర్వహణ, వాటిని శుభ్రం చేసేందుకు జలమండలి నుంచి లక్షలాది రూపాయల నిధులు బిల్లుల రూపంలో చెల్లిస్తున్నా పరిస్థితుల్లో మాత్రం మార్పు రావడం లేదు.

◆ ప్రతిరోజు ప్రైవేట్ ఏజెన్సీలకు చెందిన సీవరేజ్ జెట్టింగ్ మిషన్లు ఆయా ప్రాంతాల్లోని భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి పూడిక తీయాల్సి ఉండగా ఆ దిశగా చేపట్టకపోవడంతో మ్యాన్‌హోళ్లలో చెత్త పేరుకుపోయి మురుగు రోడ్లపైకి వస్తోంది. ఆదివారం చింతల్ మార్కెట్ రోడ్డులోని శ్రీరావులమ్మ తల్లి వెజిటబుల్ దుకాణం సమీపంలో ఉన్న ఓ మ్యాన్‌హోల్‌కు వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు ఏరులై పారింది.

◆ ఈ మురుగంతా మార్కెట్ రోడ్డును ముంచెత్తడంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మురుగు ఏరులై పారినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని దుకాణదారులు వాపోతున్నారు.



మ్యాన్‌హోల్ నుంచి పొంగుతున్న మురుగు



చింతల్ మార్కెట్ రోడ్డులో..

బ్రేక్ డౌన్.. ట్రాఫిక్ జామ్



శివాలయ నగర్ వద్ద సూరారం ప్రధాన రోడ్డుపై నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

సుభాష్‌నగర్: మరమ్మతుల కారణంగా ఆర్టీసీ బస్సు రోడ్డు మధ్యలోనే ఆగిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బర్కత్‌పుర డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదివారం సాయంత్రం 4:45 సమయంలో గండిమైసమ్మ నుంచి బర్కత్ పూరకు వెళ్తున్న క్రమంలో సూరారం ప్రధాన రోడ్డులోని శివాలయం వద్ద బస్సు రాడ్డు ఊడిపోవడంతో రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. ఓవైపు వర్షం.. మరోవైపు రోడ్డు మధ్యలో బస్సు ఆగిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయింది. విషయం తెలుసుకున్న జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకొని క్రేన్ సాయంతో బస్సును రోడ్డు పక్కన తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

వడదెబ్బతో పడిపోలేదు.. మత్తులో పడిపోయాడు!

పై చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి వడదెబ్బకు కళ్లు తిరిగి పడిపోయాడనుకున్నారా.. అయితే మీరు పొరబడినట్లే.! రంగారెడ్డినగర్ వివేకానంద విగ్రహం సమీపంలో ఉన్న ఓ వైన్స్ వద్ద ఆదివారం పూటుగా మద్యం తాగిన సదరు వ్యక్తి మత్తులో ఎటు వెళ్లాలో తెలియక సమీపంలోని దుకాణాల ఎదుట కూలబడ్డాడు. స్థానికులు అతడు వడ దెబ్బకు పడిపోయాడనుకుని నీళ్లు చల్లి నిద్ర లేపేందుకు యత్నించినా మత్తు వీడక గుర్రు పెట్టగా 'సాక్షి'కెమెరా క్లిక్ మనిపించింది. నిత్యం ఈ ప్రాంతంలో ఇలాంటి దృశ్యాలు సర్వసాధారణమేనని స్థానిక దుకాణదారులు పేర్కొంటున్నారు.

– రంగారెడ్డినగర్

